క్లుప్తంగా

తృణ ధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

అర్ధవీడు: గర్భిణులు పోషక విలువలు కలిగిన తృణ ధాన్యాలు, పాలు, పండ్లను ఆహారంగా తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని, రక్తహీనత బారి నుంచి రక్షణ పొందవచ్చని సీడీపీఓ కుమారి పేర్కొన్నారు. బుధవారం అర్ధవీడులోని కోడ్ నం.141–143 అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమీజాబి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనోత్పత్తికి అగ్రిమెంట్లు తప్పనిసరి

అర్ధవీడు: విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు తప్పనిసరిగా సంబంధిత కంపెనీలతో అగ్రిమెంట్లు చేసుకోవాలని ఏడీఏ బాలాజీ నాయక్ సూచించారు. ఈ మేరకు బుధవారం అర్ధవీడు మండలంలోని బొమ్మిలింగం, గన్నేపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో మొక్కజొన్న వేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి నేలలో కలియదున్నితే భూమి సారవంతమై దిగుబడి బాగుంటుందని తెలిపారు. ప్రకృతి సేద్యం అధికారి కాశయ్య మాట్లాడుతూ.. బొమ్మిలింగం, గన్నేపల్లిలో సుమారు 15 మంది రైతులు 30 ఎకరాల్లో కూరగాయలు, పండ్ల తోటలు, మిరప పంటను సేంద్రియ విధానంలో పండిస్తున్నారని, మిగిలిన వారు కూడా అదే విధానాన్ని అలంబించి పెట్టుబడి భారం తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శివగంగ ప్రసాద్, వీఏఏలు బాలఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

7న చెన్నకేశవస్వామి ఆలయం మూసివేత

మార్కాపురం టౌన్: చంద్ర గ్రహణం సందర్భంగా ఈనెల 7వ తేదీన మార్కాపురం పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఈఓ గొలమారి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి దర్శనాలను నిలిపివేస్తామని, సోమవారం ఉదయం 6 గంటలకు ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని బుధవారం ఓ ప్రకటనలో వివరించారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

● డీడీఓ బాలూనాయక్



మాట్లాడుతున్న డీడీఓ బాలూనాయక్

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలో అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలూనాయక్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఐకేపీ అధికారులతో ఆయా శాఖల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, క్లీనర్లకు కనీస వేతనం ఇవ్వాలి

గిద్దలూరు రూరల్: ప్రైవేటు స్కూల్ బస్సుల డ్రైవర్లకు, క్లీనర్లకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 24వ తేదీన ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వివిధ రంగాల కార్మికుల కనీస వేతనం మూడు కేటగిరీలుగా నిర్ణయించారన్నారు. కలెక్టర్ ఇచ్చిన సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ డ్రైవర్లు, క్లీనర్ల యూనియన్ నాయకుడు పిచ్చిరెడ్డి ,భూషణం, ప్రతాప్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్లో పీఎంశ్రీ ల్యాబ్‌లు ప్రారంభం


ల్యాబ్‌లను ప్రారంభిస్తున్న ఎంఈఓలు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను ఎంఈఓలు ఎస్.మధుసూదన్‌రెడ్డి, సీహెచ్ రమణారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఒకేషనల్ కోర్సులు, హెల్త్ కేర్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ సిస్టం ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మన్నం శ్రీదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


కొమరోలు : రజక కాలనీలో గృహాల మధ్యలో వర్షం నీటితో నిండిన సీసీ రోడ్డు


కొమరోలు : పురుషోత్తమునిపల్లె గ్రామంలో బురదమయంగా మారిన సీసీ రోడ్డు

అవి సిమెంటు రోడ్లే.. కానీ ఇబ్బందులు తప్పట్లే


కొమరోలు : రెడ్డినగర్‌లో సీసీ రోడ్డు దుస్థితి ఇదీ..


కొమరోలు : బండి సుబ్బయ్య వీధిలో సీసీ రోడ్డుపై నిల్వ ఉన్న వర్షం నీరు

కొమరోలు: లక్షల రూపాయలు వెచ్చించి గ్రామాల్లో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు మురుగుకూపాలను తలపిస్తున్నాయి. హెచ్చుతగ్గులుగా నిర్మించడంతోపాటు సైడు కాలువలు లేకపోవడంతో వర్షం నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. కొమరోలులోని బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి, రజక కాలనీ, రెడ్డినగర్, బండిసుబ్బయ్య వీధి, పురుషోత్తమునిపల్లె రోడ్డు, పురుషోత్తమునిపల్లె గ్రామం, నల్లగుంట్ల, గోహారపల్లె, పొట్టిపల్లె, ఇడమకల్లు తదితర గ్రామాల్లో సీసీ రోడ్లపై వారాలపాటు నిల్వ ఉన్న నీరు దుర్వాసన వస్తుండటంతోపాటు దోమల వ్యాప్తికి కారణమవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి సీసీ రోడ్లకు ఇరువైపులా సైడు కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ హయాం సంక్షేమమయం


తుమ్మలచెరువులో వైఎస్సార్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న అన్నా రాంబాబు


వద్దిమడుగులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

● వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే అన్నా


తర్లుపాడు: రైతులకు ఉచిత విద్యుత్, పేద విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, ప్రజలందరికీ ఆరోగ్య శ్రీ అమలు చేయడంతోపాటు, సాగు, తాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిన ఘనత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. వైఎస్సార్ 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాత్రి తుమ్మలచెరువులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ తరహాలోనే ఆయన తనయుడు వైఎస్ జగన్ సంక్షేమ పాలన అందించారని కొనియాడారు. ముందుగా సర్పంచ్ షాజహాన్, గ్రామ పార్టీ నాయకులు నాగూర్ షరీఫ్, కె శేషిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అబ్దుల్, మైనార్టీ సెల్ అధ్యక్షులు మాబు సుభానీ, షెడ్రక్, కాశయ్య యాదవ్‌లు అన్నాకు ఘనస్వాగతం పలికారు. బస్టాండు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి, పార్టీ నాయకులు రామిరెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి, గంటా వెంకటరెడ్డి, రమణయ్య, దాసయ్య, గుమ్మా రాజేంద్రప్రసాద్, బి.వెంకటేశ్వర్లు, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కొనకనమిట్ల మండలం నాయుడుపేటలో

మహానేతను స్మరించుకున్న పల్లె ప్రజలు

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు, తువ్వపాడు, కొత్తపల్లి, నాయుడుపేట గ్రామాల్లో మంగళవారం రాత్రి దివంగత సైఎం వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. వద్దిమడుగు ఎస్సీ కాలనీలో కార్యక్రమానికి అన్నా రాంబాబు హాజరయ్యారు.

కూలేందుకు సిద్ధంగా వంతెన


ప్రమాదకరంగా మారిన పురాతన బ్రిడ్జి


బ్రిడ్జి కింది భాగంలో బయటపడిన ఇనుప చువ్వలు

రాచర్ల: మండలంలోని పాలకవీడు నుంచి శీలంవెంకటరెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే క్రాస్ రోడ్డు సమీపంలో పురాతన వంతెన దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ మార్గంలో రాచర్ల నుంచి అనుమలవీడు, పాలకవీడు, సోమిదేవిపల్లె, సంగపేట, రామాపురం, గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పొలం పనులకు వెళ్లే వాహనాలు ఇదే మార్గంలో తిరుగుతుంటాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పురాతన వంతెన మరింత దెబ్బతిని పెచ్చులు ఊడిపడి ఇనుప చువ్వలు బయటికి కనిస్తున్నాయి. దెబ్బతిన్న పురతన వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతన బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళ అదృశ్యం


మేరి

మార్కాపురం: కుటుంబ వివాదాల నేపథ్యంలో మహిళ అదృశ్యమైన సంఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు బుధవారం తెలిపారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలో నివాసముండే పి.మేరి కుటుంబ సభ్యులతో మనస్పర్ధల కారణంగా మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. ఈ మేరకు ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు.

భార్యపై భర్త దాడి

మార్కాపురం టౌన్: కుటుంబ వివాదాల నేపథ్యంలో తనపై భర్త రాజగోపాల్ దాడి చేశాడని స్థానిక సుందరయ్య కాలనీకి చెందిన వెంకట లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సైదు బాబు తెలిపారు.

యాచకునికి గాయాలు


తీవ్రంగా గాయపడిన నరసింహ

పొదిలి: ఆర్టీసీ బస్సు చక్రం ఎక్కడంతో యాచకునికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. నరసరావుపేట ప్రాంతానికి చెందిన నరసింహ అనే వ్యక్తి గత కొంత కాలంగా బస్టాండ్ ప్రాంతంలో భిక్షాటన చేస్తున్నాడు. బస్టాండ్ వద్ద కూర్చుని ఉండగా, మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టైరు అతని కాళ్లపై ఎక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ స్థానిక జీజీహెచ్‌కు తరలించారు.

గణేశునికి ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం: గణేష్ నవరాత్రుల్లో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన లంబోదరుడిని విగ్రహాల వద్ద బుధవారం మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన వెంట పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, కౌన్సిలర్ షేక్ సలీమ్, సిరాజ్, వార్డు ఇన్‌చార్జిలు కరీముల్లా, సయ్యద్ గఫూర్, గుర్రం వెంకటేశ్వర్లు, శ్రీను, ఉత్తమ్‌కుమార్, సీయం ఖాశీం తదితరులు ఉన్నారు.

కేంద్రం విధానాలకు రాష్ట్ర ప్రభుత్వ భజన


మాట్లాడుతున్న రమేష్

పొదిలి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రభుత్వాలు భజన చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ విమర్శించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం 8వ మహాసభను ఎం.శోభారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం స్కీం వర్కర్లకు వేతనాలు పెంచకుండా దోపిడీ చేస్తోందని ఆరోపించారు. బీజేపీ హిందుత్వ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల్లో చీలిక తెస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ విశాఖ స్టీల్ ఫ్యాక్టరీలో ఎటువంటి నోటీసులు లేకుండా ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం దుర్మార్గమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగటం, దానికి అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయన్నారు. కార్మికవర్గం గతంలో ఇటువంటి గడ్డు పరిస్థితులను ఎప్పుడూ ఎదుర్కోలేదని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలవెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో పలు యూనియన్ల నాయకులు డి.సుబ్బయ్య, కేవీ నరసింహం, జి.కోటేశ్వరి, నాగేశ్వరరావు, బి.జ్యోతి, కె.ప్రజాపతి, ఎం.సునీత, వై.నగేష్, కె.నాగమల్లీశ్వరి, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు


బేస్తవారిపేటలో స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

బేస్తవారిపేట: మండల కేంద్రమైన బేస్తవారిపేటలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను కంభం సీఐ మల్లికార్జున బుధవారం తనిఖీ చేశారు. యూరియా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. యూరియా అమ్మేటప్పుడు రైతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

కంభం: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని కంభం సీఐ హెచ్చరించారు. బుధవారం వ్యవసాయాధికారి మహమ్మద్ తో కలసి కంభంలోని పలు ఎరువుల దుకాణాలు, గోడౌన్లను సీఐ తనిఖీ చేశారు. రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్‌కు గోడౌనులో ఉన్న స్టాక్‌కు వ్యత్యాసం లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. కాగా, అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్న అధికారులు యూరియా బస్తా ఎంతకు విక్రయించాలో స్పష్టంగా చెప్పకపోవడం గమనార్హం.

పాఠశాలలో అపరిశుభ్రతపై ఎంఈఓల ఆగ్రహం


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఈఓలు

కంభం: పాఠశాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు సూచించారు. మండలంలోని కందులాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం వారు తనిఖీ చేశారు. వంటగది పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ, పారిశుధ్య లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయుడిదేనని స్పష్టం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సగిలేరు వాగు పరిశీలన


వాగును పరిశీలిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సగిలేరు వాగును స్థానిక ఇరిగేషన్ డీఈ రామారావు బుధవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంలో సగిలేరువాగులో ఏ మేరకు నీటి నిల్వలు ఉన్నాయో గమనించారు. సగిలేరులో పూడికతీత కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఏఈ సురేష్, వర్క్ఇన్‌స్పెక్టర్ బొర్రా శేఖర్‌యాదవ్, ఓఎస్ అబ్రహం ఉన్నారు.

సీఐటీయూ మహాసభలకు తరలిరండి


మార్కాపురంలో మాట్లాడుతున్న రూబెన్

మార్కాపురం: మార్కాపురంలో శుక్రవారం నిర్వహించనున్న పట్టణ సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని పట్టణ కార్యదర్శి రూబెన్ కోరారు. బుధవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండేళ్ల కాలంలో చేపట్టిన పోరాటాలపై మహాసభలో చర్చించి, భవిష్యత్తు ఉద్యమాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉండగా ఇష్టారీతిగా హామీలు గుప్పించి, తీరా అధికారంలోకి వచ్చాక గాలికొదిలేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఇదే వైఖరి అవలంబిస్తే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రఫీ, కాశయ్య, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఒకసారి ఆలోచిద్దామా..!



మాట్లాడుతున్న గణిత ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి

మార్కాపురం: కవులు, కళాకారులకు ఆదరించాల్సిన అవసరం ఉందని ప్రముఖ కవి రచయిత డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి పేర్కొన్నారు. ×అనేక౯ సాహితీ వేదిక మూడవ సమావేశం బుధవారం రాత్రి శ్రీవిద్య కోచింగ్ సెంటరులో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావు రచించిన ఒకసారి ఆలోచిద్దామా..! వ్యాస సంపుటిని గణిత ఉపాధ్యాయురాలు టీవీఎన్ మల్లీశ్వరి పరిచయం చేశారు. టెట్సుకో కుయరోనాగి ప్రసిద్ధ రచన రైలుబడి గురించి డాక్టర్ వీరారెడ్డి ప్రసంగించారు. ఆలూరి బైరాగి శత జయంతి సంవత్సరం సందర్భంగా బైరాగి రచనలు, జీవితాన్ని తాత్వికతను తెలియజేస్తూ ఆగమగీతిలోని కొన్ని కవితలను మంత్రి కృష్ణమోహన్ వినిపించారు. కార్యక్రమంలో చక్కిళం శ్రీధర్, ఒ.రవిశేఖర్, ఎం.రవికుమార్, పి.భానుచంద్రమూర్తి, ఎస్.శంకర్, సీహెచ్ సుధాకర్, కె.వేణుగోపాల్, ఎం.శ్రీనివాసరెడ్డి, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.